విశాలాంధ్ర

విజయనగరం

పేజి నెం. 8

మంగళవారం 11, నవంబర్ 2025

గృహాలు కట్టుకుంటే ఆన్లైన్ చేసుకోవాలి

హౌసింగ్ ఏఈ గంగాధర్

విశాలాంధ్ర-వేపాడ: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లో ఎవరైనా నూతన గృహాలు నిర్మించదలచుకుంటే సచివాలయం సిబ్బంది ద్వారా ఆన్లైన్ చేయించుకోవాలని మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ జి.గంగాధర్ తెలిపారు.మండల కేంద్రమైన వేపాడలో హౌసింగ్ కార్యాలయంలో కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానం ప్రకారం ఎవరైనా గ్రామాల్లో ఇల్లులు కట్టుకోవాలని అనుకుంటే వారి ఖాళీ స్థలాలు,లేదా పునాదులు వేసి ఉన్నట్లయితే చూపించాలన్నారు.అలాగే ప్రతి సచివాలయంలో గల సిబ్బంది లబ్ధిదారులు చూపించిన స్టలాలకు లేదా పునాదుల దగ్గరకు వచ్చి జియో టాకింగ్ చేస్తారన్నారు.ఎవరి పేరునైతే ఇల్లు నిర్మించాలనుకుంటున్నారో వారి ఆధార్ కార్డును పట్టుకొని సచివాలయంకు వేళ్ళి పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్, బాస్కెట్ బాల్ పోటీలకు బిల్లలవలస జడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థులు

విశాలాంధ్ర- మెరకముడిదాం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పాఠశాల స్థాయి ఆటల పోటీల్లో భాగంగా రాష్ట్రస్థాయి క్రికెట్, బాస్కెట్ బాల్ పోటీలకు మండలంలో బిల్లలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన పదో తరగతి విద్యార్థి సిరియాల దుర్గాప్రసాద్ అలాగే బాస్కెట్ బాల్ విభాగంలో పదో తరగతి విద్యార్థిని బి.మణి ప్రియ ఎంపిక య్యారు. వీరంతా మండల, డివిజన్ మరియు జిల్లాస్థాయి క్రికెట్ బాస్కెట్‌బాల్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచారు. రాష్ట్రస్థాయి క్రికెట్, బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక కాబడిన ఈ ఇద్దరు విద్యార్థులను హెచ్ఎంలు వై.సుచరిత పి.ఇ.టి, వి.వి. రమణారావు ఉపాధ్యాయ సిబ్బంది మరియు గ్రామస్తులు విద్యార్థులు, అభినందనలు తెలిపారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయండి

మండల పార్టీ అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు

విశాలాంధ్ర-గుర్ల: మెడికల్ కళాశాలకు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు పోట్నూరు సన్యాసి నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం భారీ బైక్ ర్యాలీ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పెనుభర్తీ జంక్షన్ నుంచి చీపురుపల్లి తహసీల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య కళాశాలకు వ్యతిరేకంగా ప్రతి గ్రామంలో పర్యటించి కోటి సంతకాలు సేకరించా మన్నారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్సీపీ కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ పోస్టర్‌ను ఆవిష్కరించిన వారిలో వైఎస్ఆర్సిపి నాయ కులు బెల్లాన బంగారునాయుడు, బొల్ల సుబ్రమణ్యం, జమ్మూ స్వామి నాయుడు, కెంగువ మధుసూదనరావు, తోట తిరుపతి రావు, అట్టాడ అప్పలరాజు, కెల్ల సురేష్ పాల్గొన్నారు.

కంచరాం భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు వేణుగోపాల్ కి నేషనల్ గ్లోరి అవార్డు

విశాలాంధ్ర -రాజాం: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో విశేష సేవలందిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కంచరాం భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు పొందూరు వేణుగోపాల్ మాస్టర్ కి ప్రతిష్టాత్మకమైన "నేషనల్ గ్లోరి అవార్డు" లభించింది. డాక్టర్ సతపతి అన్నపూర్ణ ఆధ్వర్యంలో కమ్యూనిటీ డెవలప్మెంట్ సెంటర్ -విజయనగరం వారు ఈ అవార్డును అందజేశారు. విశాఖపట్నంలో రుషికొండలోని సాయి ప్రియ బీచ్ రిసార్ట్స్ లో నిర్వహించిన ఘనమైన అవార్డు కార్యక్రమంలో, పూరి జగన్నాథ ఆలయ ప్రధాన అర్చకులు భవానీ దాస్ మహారాజ్ చేతులమీదుగా వేణుగోపాల్ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ సుంకరి రామకృష్ణారావు, మాజీ వైస్ ఛాన్సలర్, కృష్ణ యూనివర్సిటీ డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ,కమ్యూనిటీ డెవలప్మెంట్ సెంటర్ కార్యవర్గ సభ్యులు హాజరై అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎంలు వి.వి. వసంతకుమార్, పాఠశాల కార్యదర్శి మజ్జి మదన్ మోహన్, ఉపాధ్యాయ సిబ్బంది, స్థానిక గ్రామ ప్రజలు వేణుగోపాల్ ని అభినందించారు.

జాతీయ స్థాయి అండర్ -19 ఖోఖో పోటీలకు గర్భామ్ మోడల్ స్కూల్ విద్యార్థిని జాహ్నవి

విశాలాంధ్ర-మెరకముడిదాం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ (ఎస్‌జిఆఫ్)లో ఇటీవల రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలో విజయనగరం జిల్లానుండి ప్రాతినిధ్యం వహించిన మండలంలో గర్భాం మోడల్ స్కూల్ లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న రౌతు జాహ్నవి రాష్ట్ర స్థాయి లో ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి అండర్-19 ఖోఖో పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున ఎంపికయ్యిందని ప్రిన్సిపాల్ డి.వి.ఎస్ అరుణ తెలియజేసారు. మన రాష్ట్రము తరుపున జాతీయ స్థాయి అండర్-19 బాలికల ఖోఖో పోటీల్లో పాల్గోబోతున్న జాహ్నవి ని అభినందించారు. జాతీయస్థాయిలో రానించాలని ఆకాంక్షించారు. పి.డి రాంబాబు, ఎస్ఎంసి కమిటీ,తల్లిదండ్రులు జాతీయ స్థాయిలో పోటీలకు ఎంపికైనందుకు జాహ్నవి ని అభినందించారు.

పోలీస్ శాఖలో ఎంపికైన కానిస్టేబుళ్ల శిక్షణ తక్షణమే ప్రారంభించాలి : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పోలీస్ శాఖ లో ఎంపికైన కానిస్టేబుల్ లో శిక్షణ కర్యక్రమాన్ని తక్షణమే ప్రారంభించాలని ఏ ఐ వై ఎఫ్ జిల్లా అధ్యక్షులు బూర వాసు డిమాండ్ చేశారు. సోమవారం దీనికి సంబంధించి ఉన్నత పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పోలీస్ శాఖలో విడుదలైన కానిస్టేబుల్ పోస్టుల నోటిఫికేషన్ ప్రకారం, ప్రిలిమ్స్, ఫిజికల్ టెస్టులు, మెయిన్స్ మెడికల్ పరీక్షల వంటి అన్ని దశలు పూర్తి అయ్యిసుమారు 6,100 మంది యువత ఈ నియామక ప్రక్రియలో విజయవంతమై, పోలీస్ శాఖలో శిక్షణ ప్రారంభం కావాలనే ఆశతో ఎన్నో నెలలుగా ఎదురుచూడడం జరుగుతుందన్నారు. అయితే ఈ నియామక ప్రక్రియ ప్రారంభమై నాలుగేళ్లు గడిచినా ఇప్పటికీ శిక్షణ తరగతులు ప్రారంభం కాలేదన్నారు. దీనివల్ల వేలాది మంది యువకుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందన్నారు. యువకుల యొక్క కుటుంబాలు మానసిక, ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. అభ్యర్థులు తరపున రాష్ట్ర ప్రభుత్వంశిక్షణ కార్యక్రమాలను తక్షణమే ప్రారంభించి, నియామక ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. లేని యెడల భవిష్యత్ కార్యాచరణ రూపొందించి ఉద్యమాన్ని మరింత అద్భుతం చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమం లో గణేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే మూడేళ్ళలో సిపిఐని బలోపేతం చేయాలి

జిల్లా సమితి సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కామేశ్వరరావు

విశాలాంధ్ర-విజయనగరం : రానున్న మూడేళ్ళలో సిపిఐ పార్టీని పూర్తి స్థాయిలో బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, విజయనగరం, పార్వతీపురం మణ్యం జిల్లాల నిర్మాణ బాధ్యులు పి. కామేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం విజయనగరం జిల్లా సమితి సభ్యులు సమావేశం స్థానిక డిఎన్ఆర్ అమర్‌భవన్‌లో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఇటీవల వివిద ప్రమాదాలలో మరణించిన మృతులకు, ప్రముఖ కవి అందెశ్రీ, కొట్టక్కి భూపోరాట యోదుడు పెంకి ఆనంద్ మృతులకు సమావేశంలో సంతాపం వ్యక్తం చేసి మౌనం పాటించారు.ఈసమావేశానికి ముఖ్యఅతిధిగా హాజరైన కామేశ్వరరావు పలు విషయాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. గత 5 ఏళ్ళ పాలనలో వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలను పూర్తిగా నాశనం చేసిందన్నారు. ఇప్పటి కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు లక్షలాది ఉద్యోగాల ఆశ జూపి, ప్రవేటుకు భూములను అప్పనంగా అప్పగిస్తున్నారని ఆరోపించారు. వామపక్ష పార్టీలకు కాలం చెల్లిందనే వారికి 2029లో త్వరలోనే తగిన కనువిప్పు కలుగుతుందని తెలిపారు. అమెరికాలో నేడు వామపక్ష జాలానికి ఆకర్షితుల వుతున్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. భీమార్ ఎన్నికలలో వామపక్ష పార్టీల విజయాలను త్వరలోనే చూస్తామన్నారు. కేరళలో వాయపక్ష పార్టీ అధికారంలో ఉండి సాదించిన విసయాలను నేడు ప్రత్యక్షంగా చూస్తున్నామని వివరించారు. ఏది ఏమైనా సమితి, కార్యవర్గ సభ్యులు జిల్లాలో పార్టీని బలోపేతం చేసే దిశగా తగిన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రధానమైన కుల,రైతు, విద్యార్థి, మహిళా, యువజన సంఘాలు మరింతగా కష్టపడాల్సి ఉందన్నారు. నేడు ప్రభుత్వం లో ఉన్న పవన్ కళ్యాణ్ కూటమిచేస్తున్న తప్పులను ప్రశ్నించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ రానున్నకాలంలో పార్టీతోపాటు, అనుభందసంఘాలను పూర్తిస్థాయి లో బలోపేతం చేస్తామ న్నారు. అందుకు తగిన విదంగా కమిటీలను వేసామని చెబుతూ సమావేశంలో ఆయా సంఘాలను ప్రకటించారు. ఈకార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, చేతివృత్తి దారుల రాష్ట్రసంఘం ప్రధాన కార్యదర్శి కె.వీరాంజనేయులు సభ్యులను ద్దేశించి కాసేపు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు అలమండ ఆనందరావు, బుగత అశోక్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు రంగరాజు, మద్యాహ్న భోజన పథకం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. స్రవంతి , వివిద నియోజక వర్గాల బాధ్యులు పాల్గొన్నారు.

చనిపోయిన లబ్ధిదారులకు హుదూద్ ఇల్లు వారసులకు ఇవ్వాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేగల అప్పలరాజు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జామి మండలం అలమండ గ్రామంలో హుదూద్ ఇల్లు చనిపోయిన లబ్ధిదారుల వారసులకు ఇవ్వాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేగల అప్పలరాజు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 లో హులుదు తుపాను కారణంగా నష్టపోయిన వారికి అలమండ గ్రామంలో 160 ఇల్లు నిర్మించడం జరిగిందన్నారు. అనేక పోరాటాల ఫలితంగా 135 మందికి లాటరీ పద్ధతి ద్వారా పట్టాలు ఇచ్చారన్నారు. ఈ క్రమంలో కొంతమంది లబ్ధిదారులు చనిపోవడం జరిగిందన్నారు. అయితే వెంటనే వారికి సంబంధించిన వారసులు అబ్బాయిలైనా , అమ్మాయిలయినా కుటుంబ సభ్యుల అంగీకారం మీద వెంటనే ఇల్లు కేటాయించాలన్నారు. ఈ విషయంలో గతంలో అనేక సార్లు వినతి పత్రాలు సమర్పించిన లాభం లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం లబ్ధిదారుల వారసులంతా ఇల్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు కావున వెంటనే ప్రభుత్వం స్పందించి లబ్ధిదారుల వారసులకు పట్టాలు ఇప్పించి, ఆ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రయత్నం చేయాలన్నారు ఈ కార్యక్రమంలో అలమండ గ్రామ తుఫాను బాధిత వారసులు తదితరులు పాల్గొన్నారు

ఉద్యమించిన కల్లుగీత కార్మికులు

గీత కార్మికులను ఆదుకోవాలి

చేతి వృత్తిదారుల సమైక్య రాష్ట్ర కార్యదర్శి రామానుజనేయులు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఒక్కసారిగా ఉద్యమించారు. గతంలో ఇచ్చిన 560 జీవో అమలు చేయాలని కోరుతూ సోమవారం స్థానిక అమర్ భవన్ వద్దనుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ఆంధ్రప్రదేశ్ కల్లుగీత పని వారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పురం అప్పారావు, ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా. చేతివృత్తిదారుల సమైక్య రాష్ట్ర కార్యదర్శి కే రామానుజనేయులు మాట్లాడుతూ కల్లుగీత కార్మికులకు గతంలో ఇచ్చిన 540 జీవో అమలు చేసి కళ్ళు చెట్లకు మార్కింగ్ ఇవ్వాలన్నారు. గీత కార్మికులుగా అనేకమంది వృత్తిలో ఉండగా పనిచేసే క్రమంలో చెట్టుపై నుండి పడి మరణించడమే కాకుండా మరి కొంతమందివికలాంగులుగా కూడా మారారన్నారు . మరణించిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని వికలాంగులకు పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. కళ్ళు చెట్లను తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అర్హత ఉన్న గీత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు కే అప్పారావు, గౌరవ అధ్యక్షులు పురం అప్పారావు, ప్రధాన కార్యదర్శి కొలుసు కోటారావు మాట్లాడుతూ. ఎన్ని ప్రభుత్వాలు మారినా గీత కార్మికులకు న్యాయం జరగలేదన్నారు. గీత కార్మికులకు 45 సంవత్సరాలకే పెన్షన్ 7000 ఇవ్వాలని, ప్రమాదంలో వికలాంగులైన వారికి ఐదు లక్షల మరణించిన వారి కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. మహిళ గీత కార్మికులకు స్వయం సహాయక సంఘాల ఏర్పాటు చేయాలని దీనికి సంబంధించిన సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు జరపాలన్నారు. బంజర భూముల్లో తాటి చెట్లను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన కల్లుగీత కార్మికుల పాల్గొన్నారు

క్రీడా మైదానంలో పాముల బెడద

బెంబేలెత్తిపోతున్న విద్యార్థులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్.కోట నియోజకవర్గ కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పాముల సంచారముతో విద్యార్థులు బెంబేలు ఎత్తుతున్నారు. మైదానంలో గడ్డి, భారీగా తుప్పలు పెరిగి పోవడంతో విషసర్పాలు విచ్చలవిడిగా తిరుగుతుండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మైదానంలో పలుచోట్ల పాము పొరలు కనిపించడంతో విద్యార్థులలో భయాందోళన మొదలైంది. దీంతో ఈ క్రీడా మైదానం కి ఆటలకు వెళ్లేందుకు విద్యార్థులు నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే విద్యార్థులు తల్లిదండ్రులు కూడా వెళ్లవద్దని వారి పిల్లలకు చెప్పినట్లు బోగట్ట. శృంగవరపుకోట కు చెందిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మరియు క్రీడాకారులు దొడ్డి సూర్యనారాయణ, ఎలమంచిలి పార్థసారథి, అంబటి యశ్వంత్, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ తదితరులు ఈ క్రీడా మైదానాన్ని పరిశీలించి తగు నివేదిక పాఠశాల యాజమాన్యం కి అందజేశారు. విశాఖ అరకు ప్రధాన రహదారికి పక్కన కాలువ నిర్మాణ సమయంలో గుత్తేదారుడు మైదానంలో రాళ్లతో కూడిన శిథిలాలను ఈ మైదానంలో నిలువ చేశాడు. అందువల్ల క్రీడామైదానం మొత్తం ఎందుకు పనికిరాకుండా నిరుపయోగంగా మారిపోయిందని దానికి తోడు విష జంతువుల సంచారం ఎక్కువ అయ్యిందనే విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మండల తాసిల్దారు కు అనేక మార్లు విన్నవించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా తయారిందని విద్యార్థులు వారి తల్లిదండ్రులు తెలియజేస్తున్నారు. గతంలో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం విద్యార్థుల భద్రత ప్రభుత్వం కచ్చితంగా తీసుకోవాలని నిబంధనలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పేడచెవిన పెట్టడం పలు అనుమానాలకు తావిస్తుంది ఇప్పటికైనా మండల శాఖ అధికారులు స్పందించి విద్యార్థుల క్రీడా మైదానాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. క్రీడా మైదానాన్ని నిరుపయోగంగా ఉంచడాన్ని విద్యార్థులకు క్రీడలు దూరం చేసే విధంగా ఉందనీ తక్షణం అందుబాటులోకి తేవాలని లేనియెడల రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హెచ్చరించారు.

అరసాడలో రూ.102 కోట్లతో బయోగ్యాస్ ప్లాంట్

నేడు రాజాంలో వర్చువల్ గా శంకుస్థాపన కార్యక్రమం

కలెక్టర్ రాంసుందర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయనగరం/వంగర : వంగర మండలం అరసాడ గ్రామంలో పివిఎస్ గ్రూప్ ఆధ్వర్యంలో సుమారు రూ.102 కోట్ల వ్యయంతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు కానుంది. దీని నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కనిగిరి నుండి మంగళవారం ఉదయం 10.30 గంటలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని రాజాం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. అరసాడ గ్రామంలో ప్లాంట్ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రోజుకు 20 టన్నులు ఉత్పత్తి సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 500 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని, నిరుద్యోగ సమస్య కొంత మేర తగ్గుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక లాభాలు కలుగుతాయని వివరించారు. అనుబంధంగా మరికొన్ని యూనిట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. శంకుస్థాపన ఏర్పాట్లు పక్కాగా చేయాలని, వర్చువల్ విధానంలో శంకుస్థాపన వీక్షించడానికి అవసరమైన స్క్రీన్లు, కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, ఆర్డీవో సత్యవాణి, తహసీల్దార్ పి.రామారావు, నెడ్కాప్, ఏపీఈపీడీసీఎల్ అధికారులు, పీవీఎస్ సంస్థ ప్రతినిధి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు కు నేషనల్ గ్లోరి అవార్డ్

విశాలాంధ్ర-బొబ్బిలి: సుదీర్ఘ కాలం జిల్లాలో ముఖ్యంగా బొబ్బిలి పట్టణం పరిసర ప్రాంత ప్రజలకు సేవలందిస్తూ వారి మన్నలను పొందుకున్న ప్రముఖ సామాజిక సేవా సంస్థ కారుణ్య ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సామాజిక సేవలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఆదివారం రాత్రివిశాఖపట్నం, ఋషుకొండ లోని శ్రీ సాయి ప్రియ బీచ్ రిసార్ట్ నందు కమ్యూనిటీ డెవలప్మెంట్ సెంటర్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో సమాజానికి వివిదరంగాలలో అత్యున్నత సేవలందించిన సంస్థలకు, వ్యక్తులకు నేషనల్ గ్లోరీ 2025 అవార్డులను ప్రదానం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగ బొబ్బిలి కి చెందిన కారుణ్య సంస్థ చేస్తున్న సేవలకు గుర్తింపు నిస్తూ ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ జె సి రాజును దూరదర్శన్ డైరెక్టర్ ఓ. పి. రాజ్ పురోహిత్ , పూరి జగన్నాథం ప్రధాన అర్చకులు మహరాజ్, పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ గోపాల కృష్ణ సి డి సి ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ అన్నపూర్ణ చేతుల మీదుగా అవార్డును,ప్రశంసా పత్రాన్ని ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు. కారుణ్య ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సామాజిక సేవలను కొనియాడారు. వీరితో పాటు రోటరీ ప్రతినిధులు హాజరై జె సి రాజును సత్కరించారు. సమావేశంలో బొబ్బిలి రోటరీ అధ్యక్షులు శ్రీ హరి ,కార్యదర్శి శివ కాంత్ , జయ ప్రకాష్, కృష్ణ మోహన్, నితిన్,పి వి ఏ మెర్సీ బాయ్, వివిధ రాష్ట్రాలనుండి,జిల్లాల నుండి అవార్డు గ్రహీతలు హాజరయ్యారు.

12న భారీ బైక్ ర్యాలీ

విశాలాంధ్ర-గరివిడి: రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12న వైకాపా ఆధ్వర్యంలో భారీ బైకు ర్యాలీ నిర్వహించనున్నట్లు గరివిడి మండల వైకాపా నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యమ పోస్టర్‌ను మండల వైకాపా అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొనిసి కృష్ణం నాయుడు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములు నాయుడు, కోనూరు మరియు తాటిగూడ పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు యలకల అప్పలనాయుడు, యడ్ల అప్పారావు, కొండపాలెం సర్పంచ్ ప్రతినిధి పి. కుమార్, వైకాపా నాయకులు బొంపల్లి వెంకటరావు, కడుముల రాంబాబు, పల్లి జగదీశ్వరరావు, ఇక్బాల్ షరీఫ్ తదితరులు ఆవిష్క రించారు.ఈ సందర్భంగా మీసాల విశ్వేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు చేతుల్లోకి ఇవ్వాలనే ప్రయత్నం తీవ్రంగా ఖండనీయమని అన్నారు. అమరావతిలో వేల ఎకరాల రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నిర్వహించే పాలకులు పేదలకు అవసరమైన ప్రభుత్వ వైద్య విద్యను అడ్డుకోవడం దారుణమని పేర్కొన్నారు.శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, జిల్లా వైకాపా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆదేశాల మేరకు ఈ ఉద్యమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను కాపాడుకునే ఈ ఉద్యమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని తమ మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.గరివిడి శివారు పెనుబర్తి జంక్షన్ నుండి ప్రారంభమై, గరివిడి ప్రధాన రహదారి మీదుగా చీపురుపల్లి తహశీల్దార్ కార్యాలయం వరకు బైకు ర్యాలీ సాగనుందని తెలిపారు. ఈ ర్యాలీలో 350 కి పైగా బైకులు పాల్గొనే అవకాశముందని వైకాపా నాయకులు పేర్కొన్నారు.

బొంతలకోటి కి జాతీయ అవార్డు ప్రధానం

విశాలాంధ్ర -గజపతినగరం: సంగీత, సాహిత్య, జానపద కళారూపాల వినూత్నబోధనా పద్ధతుల రూపకర్త జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు డాక్టర్ బొంతలకోటి శంకరరావు కు ఆదివారం రాత్రి విశాఖపట్నం లో సాయి ప్రియా బీచ్ రీసార్ట్స్ లో కేంద్రప్రభుత్వ దూరదర్శన్ సోషల్ ఆక్టివిస్ట్ డాక్టర్ ఓ.పి.పురోహిత్, పూరి జగన్నాధ ఆలయం ప్రధాన పీఠాదిపతులు భవాని దాస్ మహారాజ్ దేశంలో ని ప్రధానవిశ్వ విద్యాలయాల పూర్వ వైస్‌ఛాన్సెలర్స్, కమ్యూనిటీ డెవలప్మెంట్ సెంటర్ ఆచార్యులు, చేతులమీదుగా నేషనల్ గ్లోరీ అవార్డు ను అందుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మహారాజ్ మాట్లాడుతూ శంకరరావు మాస్టర్ కళాబోధన దేశంలో అపూర్వ సృష్టి అని, విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి మూలమని కొనియాడారు.రాజపురోహిత్ వివరిస్తూ ఒక ఉపాధ్యాయుడుగా 350 అవార్డులు అందుకొని వరల్డ్ బుక్ లో స్థానం సంపాదించడం గొప్పవిషయం ఈ కార్యక్రమం లో పూర్వ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ డివిజి శంకరరావు, సి. డి సి ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.అన్నపూర్ణ, పువ్వల శ్రీనివాసరావు తదితరులు డాక్టర్ బొంతలకోటి శంకరరావు కళా సేవను కొనియాడారు. ఫోటో రైట్ అప్ ం-బొంతల కోటికి జాతీయ పురస్కార ప్రధానం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా'ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర -దత్తిరాజేరు: కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధా నాలను అవలంబిస్తూ ముందుకు సాగుతుందని, మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసేందుకు చూస్తుందని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు అన్నారు. అందులో భాగంగా చేపడుతున్న ప్రజా ఉద్యమాల్ని ప్రజల మద్దతిస్తూ ముందుకు సాగాలని అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆదేశాలమేరకు ప్రజా ఉద్యమంలో భాగంగా ఈ నెల 12న నియోజకవర్గం కేంద్రంలో జరగబోయే ర్యాలీ పోస్టర్ సోమవారం నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు మహదేవ్ ఫణేంద్ర నివాసం లో ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు పోస్టర్ ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నారని వాటికి నిరసనగా వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు మండల నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు తెలియజేయాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్సీపీ కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు రాపాక కృష్ణార్జున, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్,యువజన విభాగం అధ్యక్షులు దత్తి చిరంజీవి, మంత్రి క్రాంతికుమార్, శంకర్,మజ్జి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

50 డివిజన్ అయ్యప్ప వడి పూజ

విశాలాంధ్ర-విజయనగరం, కంటోన్మెంట్ : నగరంలో 50వ డివిజన్ వైఎస్ ఆర్ నగర్ లో అయ్యప్ప స్వామి వడి పూజ సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భారీగా స్వాములు తరలివచ్చారు. భక్తి పాటలతో ఈ ప్రాంతమంతా మార్మోగింది. కాలనీ. యూత్ లీడర్ చెర్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం విజయవంతమైంది.

ప్రతి పనికి ప్రజల డబ్బులేనా?

-ఇంటి నంబర్ బోర్డుల పేరిట వసూళ్లు - ప్రజల్లో ప్రభుత్వంపై ఆగ్రహం

విశాలాంధ్ర-పూసపాటిరేగ: ప్రతి పనికీ ప్రజలే డబ్బులు చెల్లిస్తే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలు రకాల పన్నులు, ట్యాక్సులు, సర్వీస్ ఛార్జీలు వసూలు చేస్తున్నా, ఇంకా చిన్న చిన్న పనులకూ ప్రజల జేబుల మీద భారం వేస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.తాజాగా ఇంటి నంబర్ బోర్డుల పేరుతో ప్రతి ఇంటి నుంచి 50 రూపాయలు వసూలు చేయడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారి తీసింది. జిల్లా స్థాయి ఆదేశాలు వచ్చాయంటూ గ్రామాల్లో కాంట్రాక్టర్ల ద్వారా వసూళ్లు జరుగుతున్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు.ఇది కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన ఆర్డర్ అని, పంచాయతీలు తీర్మానం చేసుకున్నట్లే వసూళ్లు చేస్తున్నామని అధికారులు చెబుతున్నా, చాలా చోట్ల పంచాయతీలు ఏ తీర్మానం చేయకుండానే వసూళ్లు మొదలుపెట్టినట్టు తెలుస్తోంది. ప్రజల అభిప్రాయం ప్రకారం ఈ నంబర్ ప్లేట్లు అంత అవసరమైతే పంచాయతీ రాజ్ శాఖే ఖర్చు భరించాలి, ప్రజలపై అదనపు భారం వేయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి పనులతో ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమవుతుందని పలువురు నాయకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల డబ్బుతో నడుస్తున్న ప్రభుత్వమే ఇలాంటి నిర్ణయాలపై పునరాలోచన చేయాలని, పై అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జెడ్పీ హైస్కూల్‌లో ఎస్ఏ-1 తెలుగు పరీక్ష పరిశీలన

విశాలాంధ్ర-వేపాడ : మండల కేంద్రమైన వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎస్ఏ-1 తెలుగు పరీక్షను మండల విద్యాశాఖ అధికారి ఎన్.నాగభూషణరావు సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగావిద్యార్థుల అసెస్మెంట్ బుక్స్ ను,అలాగే వారి రైటింగ్‌ను పరిశీలించి, మరింతగారైటింగ్‌నైపుణ్యాన్నిఅభివృద్ధిచేసుకోవాలని విద్యార్థులకుసూచనలుఇచ్చారు. ఈపరిశీలనకార్యక్రమంలోపాఠశాలప్రధానోపాధ్యాయురాలు ఎస్.ఎస్. వల్లి, సిఆర్ఎంటి సభ్యులు పాల్గొన్నారు.

నిర్వాసితులు సర్వం కోల్పోయారు తక్షణమే ఆదుకోవాలి

ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ డిమాండ్

విశాలాంధ్ర -శృంగవరపుకోట: మండలం లో బొడ్డవర నిర్వాసిత శిబిరం వద్ద నిర్వాసితులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన చేపట్టారు ఈ సందర్భంగా చల్లా జగన్ మాట్లాడుతూ. గతంలో నిరుపేదలుగా గుర్తించి జీవనోపాధి చేసుకొండని ప్రభుత్వం డీ ఫారం భూమి ఇస్తే నిర్వాసితుల వద్ద ఉన్న మొత్తం భూమిని మోసపూరితంగా వ్యవహరించి మూడు సంవత్సరాల్లో కంపెనీ కట్టి అందులో అందరికీ ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, ఉద్యోగాలతో పాటు కంపెనీలో షేర్లు ఇస్తామని నమ్మబలికి భూమంతా తీసుకున్న తర్వాత18 సంవత్సరాలు దాటిన ఎటువంటి కంపెనీ నిర్మించకుండా ఆ భూమిని అమ్మకానికి పెట్టడం అన్యాయమని, సర్వం కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలని చల్లా జగన్ డిమాండ్ చేశారు, మరలా నిర్వాసితుల బ్రతుకుతెరువు కోసం అధికారికంగా నిర్వాసితుల భూమి నిర్వాసితులకే ఇవ్వాలని కోరారు అధికారికంగా నిర్వాసితులకు ప్రభుత్వం అప్పగించాలని కోరారునిర్వాసితులు మాట్లాడుతూ భూములు కోల్పోయిన తమకు ప్రభుత్వాల నుంచి గాని అధికారుల నుంచి కానీ స్పందన రావడం లేదని మండిపడ్డారు.ఎమ్ఎస్ ఎమ్ పార్కుల పేరుతొ జిందాల్ యాజమాన్యం తమ భూములు తీసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తుంది అని ఆరోపించారు. 18 సంవత్సరాలగా తమ భూములు తమ అధీనంలో ఉన్నాయి అని , తాము సాగు చేసుకుంటున్నామని అని అన్నారు. జిందాల్ కంపెనీ దౌర్జన్యం గా తమ పంట పొలాల్లో ప్రవేశిస్తూ నాశనం చేయడంను తాము సహించము అని అన్నారు. ఈ విషయం పై ఫిర్యాదు చేసినా అధికారుల నిర్లక్ష్యం తగదు అన్నారు. గౌరవ కలెక్టర్ గారికి జిందాల్ ల్లో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ లు రద్దు చేయమని దరఖాస్తులు ఇచ్చాము అని కానీ కలెక్టర్ ఆ చట్టాన్ని గుర్తించలేదన్నారు అ దరఖాస్తులను పరిశీలించి వెంటనే అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి తమ భూములు తమకి అధికార పూర్వకంగా బదిలీ చేయాలి అని డిమాండ్ చేసారు. తమకి న్యాయం జరిగే వరకూ పోరాడుతాం అని , తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం అని అన్నారు.గత 144 రోజుల గా నిరసన తెలియజేస్తున్నా ప్రభుత్వాలు పట్టనట్లు ఉన్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు నిర్వాసితుల భూములు నిర్వాసితులకు ఇచ్చేవరకు పోరాడుతామన్నారు.

కొవ్వాడ శివాలయంలో భక్తుల తాకిడి

-కార్తీక సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ
-శివాలయంలో ప్రత్యేక పూజలు
-నాలుగో సోమవారం లక్ష దీపోత్సవానికి సన్నాహాలు
-ప్రత్యేక పూజలు నిర్వహించిన సర్పంచ్ కోట్ల రఘు

విశాలాంధ్ర- పూసపాటిరేగ: కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా పూసపాటిరేగ మండలం కొవ్వాడ గ్రామంలోని స్వయంభుగా వెలిసిన పురాతన శివాలయంలో భక్తుల తాకిడి అధికంగా కనిపించింది. సుమారు 700 సంవత్సరాల క్రితం నిర్మించబడిన ఈ పవిత్ర క్షేత్రంలో సోమవారం ఉదయంమూడుగంటలనుంచే భక్తులు తండోపతండాలుగా వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్థానిక జనసేన సర్పంచ్ కోట్ల రఘు తెలిపారు. పూజల అనంతరం ప్రతి భక్తుడికి రెండు రకాల ప్రసాదాలు పంపిణీ చేయగా, అనంతరం సర్పంచ్ ఆధ్వర్యంలో శివాలయం కమిటీ పెద్దలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.కార్తీక మాసం నాలుగో సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ స్వయంభు శివాలయంలో లక్ష దీపార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుండి సుమారు 30 వేల మంది భక్తులు హాజరుకానుండగా, స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి, కొందరు మంత్రులు కూడా పాల్గొనే అవకాశం ఉందని సర్పంచ్ కోట్ల రఘు తెలిపారు. మండల ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో కోట్ల రఘు తో పాటు గ్రామ పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి రూ.1లక్ష విరాళం

దాతృత్వం చాటుకున్న కోటాన అర్జునరావు దంపతులు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని చామలాదేవి అగ్రహారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న శివాలయానికి రూ. 1లక్ష విరాళం అందించి కోటాన అర్జునరావు-సత్యవతి దంపతులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. గ్రామ సర్పంచ్ సేనాపతి లీల అప్పారావు చేతుల మీదుగా శివాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోటాన పైడింనాయుడుకి విరాళాన్ని అందజేశారు. ఏడేళ్ల క్రితం గ్రామంలోని కోటాన కుటుంబానికి చెందిన భూముల్లో పనులు జరుగుతుండగా శివలింగం వెలయడంతో గ్రామమంతా ఆధ్యాత్మికతలో మునిగిపోయింది. దాంతో గ్రామస్తులు ఏకమై శివాలయం నిర్మాణానికి పూనుకున్నారు. అయితే నిధుల కొరతతో పనులు నిలిచిపోయిన నేపథ్యంలో ఇప్పుడు అర్జునరావు దంపతుల విరాళం ఆ పనులకు ఊపిరి పోసింది. ఈ సందర్భంగా సర్పంచ్ లీల అప్పారావు మాట్లాడుతూ ఆ మహాదేవుని పుణ్యప్రభావంతోనే ఈ గ్రామం భాగ్యవంతమైంది. అందరం కలిసికట్టుగా ఈ శివాలయాన్ని సంపూర్ణంగానిర్మించుకుందాంఅనిపిలుపునిచ్చారు. విరాళదాత అర్జునరావు మాట్లాడుతూ శివాలయం పూర్తయి గ్రామ ప్రజలకు ఆధ్యాత్మిక శాంతిని కలిగించాలని.భగవంతుని కృప ఉంటే వచ్చే ఏడాది మరో లక్ష విరాళంగా అందిస్తానని అన్నారు. ఇప్పటికే ఆయన ఆర్థిక సహాయంతో గ్రామంలోని యాదవ కుల ఆరాధ్యదైవం శ్రీకృష్ణ ఆలయం నిర్మాణం పూర్తయింది. అలాగే గ్రామదేవత పరదేశమాంబ ఆలయం పనులు కూడా త్వరలో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి దాతృత్వంతో ముందడుగు వేస్తున్న అర్జునరావు దంపతులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాస్థాయి బాలల నాటిక పోటీలలో విజేతలు

విశాలాంధ్ర -విజయనగరంటౌన్:ఆంధ్రప్రదేశ్‌గ్రంథాయ సంఘంవిజయనగరంజిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి బాలల ఆహ్వాన నాటిక పోటీల విజేతలు వివరాలను సంఘం అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ ప్రకటించారు. విజేతలకు ఐదువేల రూపాయల నగదు బహుమతులు ప్రదానం చేశారు .ప్రథమ స్థానాన్ని బొండ్లపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ఒక చుక్క జాగ్రత్త నాటిక కైవసం చేసుకుంది .జొన్నవలస జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన మార్పు నాటిక కు ద్వితీయ స్థానం సాధించగా ,గురజాడ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన జాగృతి నాటిక తృతీయ స్థానాన్ని సాధించింది. విజేతలకు సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ ,ఉపాధ్యక్షులు విన్నింటి కళావతి, సూర్యనారాయణ దంపతులు ,వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ఎం సుభద్ర దేవి, జనవిజ్ఞానవేదిక జాతీయ నాయకులుడాక్టర్ ఎం విఆర్‌కృష్ణాజీ, బహుమతిప్రదానం చేశారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు . పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పసుమర్తి సన్యాసిరావు, గెద్ద వరప్రసాద్ వ్యవహరించారు. ఈపు విజయ్ కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. గురజాడ పబ్లిక్ స్కూల్ లో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ మానస ,పాఠశాల కరస్పాండెంట్ ఎం స్వరూప,గిరిజా ప్రసన్న, గ్రంధి రాజశేఖర్ , డివి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మెలగాలి

ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు పిలుపు

విశాలాంధ్ర-వేపాడ: మానవ జీవితంలో ఆధ్యాత్మిక చింతనకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే నిజమైన శాంతి లభిస్తుందని మండల పరిషత్ అధ్యక్షుడు దొగ్గ సత్యవంతుడు పేర్కొన్నారు. మండలంలోని సోంపురం గ్రామంలో శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి వారికి మూడవ కార్తీక సోమవారం సందర్భంగా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొని భక్తులతో కలిసి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సత్యవంతుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతనతో, ఆధ్యాత్మిక భావంతో మెలగాలి. భక్తి మనసుతో నడిస్తే జీవితం ప్రశాంతంగా సాగుతుంది. పెద్దల పట్ల గౌరవం, సంప్రదాయబద్ధ జీవన విధానం మన సంస్కృతికి ప్రతిబింబం అని అన్నారు. అన్న సమారాధన కార్యక్రమంలో సుమారు రెండు వేలకు పైగా భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపీటీసీలు ఆకులు సత్యనారాయణ, తొండవరపు వెంకటరమణ, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు,గ్రామ పెద్దలు ఉగ్గిన శ్రీనివాసరావు, కోటం శెట్టి గణపతి, గొర్రిపోటు రాము, లక్ష్మునాయుడు, రమణ,దుల్ల నాయుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసాయి ప్రేమామృతం పేరుతో గర్భిణీలకు భోజన వసతి

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నెలవారీ తనిఖీలు నిమిత్తం వస్తున్న గర్భిణీలకు స్థానిక సత్యసాయి భజనమండలి ఆద్వనేర్యంలో ప్రతీనెలా భోజన వసతిని కల్పిస్తున్నారు. అందులో భాగంగా ఈనెల 60 మంది గర్భిణీలకు పౌష్టికమైన ఆహారాన్ని అందించేందుకు జామికి చెందిననే ఇప్పాక సుజాత ముందుకు వచ్చారని, ఇలా ప్రతీ నెలా ఎవరో ఒకరు దాతులు రావచ్చని సత్యసాయి భజనమండలికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు విన్నకోట నానాజీ తెలిపారు. భోజనకార్యక్రమాన్ని పిహెచ్‌సీ వైద్యాధికారిణి కె.సామ్రాజ్యలక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈకార్యక్రమంలో గర్భిణీలుకు, వారి సహాయకులకు, వైద్యసిబ్బందికి భోజన వసతి కల్పించారు.

జిందాల్ భూములలో ఎం ఎస్ ఎం ఈ పార్క్ ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర -శృంగవరపుకోట:జిందాల్ భూములలో ఎం ఎస్ ఎం ఈ పార్క్ ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త దొడ్డి సూర్యారావు తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ లో తాసిల్దార్ శ్రీనివాసరావు కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిందాల్ భూ కుంభకోణం పై 2015లో లోకాయుక్త ఇచ్చిన తీర్పుని అమలు చేయాలని, జిందాల్ భూసేకరణలో నిజమైన రైతులు ఎవరన్నది నిర్ధారణ చేసి జిందాల్ కంపెనీ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని, ఈ ప్రాంత నిరుద్యోగ సమస్యను తీర్చడానికి ఎం ఎస్ ఎం ఈ పార్క్ ఏర్పాటు చేయాలని, ఎం ఎస్ ఎం ఈ పార్కు ఏర్పాటు చేసే ముందు ప్రభుత్వము నిజమైన రైతులతోనూ జిందాల్ కంపెనీ తోనూ ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం రైతులను సంతృప్తిపరిచేలా తగు చర్యలు చేపట్టాలని కోరుతూ తాసిల్దార్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు.

మానవసేవే మాధవసేవ

శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు

విశాలాంధ్ర-మెరకముడిదాం:మెరకముడిదాం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నాడు బూడాం గ్రామ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆసుపత్రికి తనిఖీకి వచ్చిన గర్భిణీలకు పౌష్టిక ఆహారం అందజేయటం జరిగింది. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు పూసర్ల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ మాట్లాడుతూ గర్భిణీలు ఆరోగ్యంగా బాగుంటే శిశువులు ఆరోగ్యంగా ఉంటారని ఆయన తెలిపారు. అలాగే ప్రజలలో ఆధ్యాత్మిక భావన పెంపొందించడం జరుగుతుందని అన్నారు. మానవసేవయే మాధవ సేవగా భావించి శ్రీ సత్య సేవాసమితి సభ్యులు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని అన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయటం వలన తమకు ఎంతో ఆనందంగా, సంతోషంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అజిత్ బాబు, సిబ్బంది, ఆశా వర్కర్లు,తదితరులు పాల్గొన్నారు.

పంచాయితీలో సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట పంచాయితీలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించి, పంచాయతీకి ఆదాయం పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పూసపాటి ప్రతాప్ వర్మ జిల్లా గ్రీవెన్స్ సమావేశంలో కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పంచాయతీ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో సుమారు 15 ఏళ్లుగా బహిరంగ వేలం నిర్వహించకుండా, కొందరు షాపులను అధిక రేట్లకు అద్దెకు ఇచ్చి పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. బహిరంగ వేలం ద్వారా నిజమైన వ్యాపారస్తులకు షాపులు కేటాయిస్తే పంచాయతీ ఆదాయం పెరుగుతుందని సూచించారు. అలాగే పట్టణంలోని గాంధీ పార్క్ ఆక్రమణలకు గురవుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పార్కును ఆధునికీకరించి ప్రజల వినోదానికి అనువుగా మార్చాలని, ఆక్రమణలను తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో షాపులు నిర్వీర్యంగా ఉండడంతో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, ఈ షాపులను రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే చిన్న వ్యాపారులకు కేటాయిస్తే వారికి ఉపాధి లభించడమే కాకుండా పంచాయతీకి ఆదాయం కూడా పెరుగుతుందని తెలిపారు. అదేవిధంగా సాయిబాబా గుడి వెనుక ఉన్న కోనేరులోని దుర్గంధం కారణంగా సమీపంలోని రెండు హాస్టళ్లలో విద్యార్థులు వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించి, కోనేరును శుభ్రపరచాలని పూసపాటి ప్రతాప్ వర్మ డిమాండ్ చేశారు. మొత్తంగా పంచాయితీ సమస్యలను నిర్లక్ష్యం చేయడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని, అధికారులు తక్షణమే స్పందించి పంచాయితీ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

పాఠశాలకు బీరువా బహూకరణ

విశాలాంధ్ర -రామభద్రపురం: మండలంలోని ఏనుబ రువు పాఠశాలకు సామాజిక కార్యకర్త ప్రధానోపాధ్యాయుడు కారుణ్య ఫౌండేషన్ సంస్థ చైర్మన్ జెసి రాజు10వేలు విలువచేసే బీరువాను సోమవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గేదెలు ముసలయ్యకు బహూకరించారు. గత కొన్ని సంవత్సరాలుగా పాఠశాలలో రికార్డులు భద్రపరుచుకునేందుకు బీరువా లేకపోవడంతో ముసలయ్య జెసి రాజుకు సహాయం చేయమని కోరారు. ఆయన తక్షణమే స్పందించి బీరువాను బహుకరించారు. విద్యాశాఖ అధికారి తిరుమల ప్రసాదు ప లువ రుఉపాధ్యాయులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

శివలింగేశ్వరుని కృపతో ఘనంగా అన్నసమారాధన

చామలాదేవి అగ్రహారంలో విశేష భక్తి ఉత్సాహం

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని చామలాదేవిఅగ్రహారంలోఇటీవలప్రతిష్ఠాత్మకంగా నిర్మితమైన శ్రీఉమాశివలింగేశ్వర ఆలయం వద్ద మూడవ కార్తీక సోమవారం సందర్భంగా ఆధ్యాత్మికవాతావరణంనెలకొంది. సోమవారం ఉదయంవేకువజామున ప్రారంభమైన పూజా కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు,ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు. హర హర మహాదేవా అనే నినాదాలతో మార్మోగిన ఆలయప్రాంగణంలోభక్తజనులుశివలింగేశ్వరని దర్శించి,తమమొక్కులుచెల్లించుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం ఆవరణలో ప్రారంభమైన అన్న సమారాధన ఘనంగా సాగింది. చుట్టుపక్కల గ్రామాలైన వావిలపాడు,వీలుపర్తి,వెల్దాం,కొలుకుపాలెం,చినదుంగాడ, పెదదుంగాడ,చిననల్లబిల్లి తదితర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా విశాఖకు చెందిన శివలంకి ముత్యాల నాయుడు,వర్రి రవికాంత్, ఫణి తేజలు కలసి రూ. 10,116 విరాళాన్ని ఆలయానికి అందించారు. గ్రామస్తులు, భక్తులు కూడా తమ వంతు సహకారం అందించి దైవభక్తిని చాటారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ భగవంతుని కృపతో ఈ అన్నదాన కార్యక్రమం విజయవంతంగా పూర్తి అయింది. శివలింగేశ్వరునిఆశీస్సులుగ్రామంపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం అన్నారు. గ్రామ పెద్దలు, భక్తులుఆనందోత్సాహాలతోఆలయప్రాంగణాన్ని నింపగా,ఆధ్యాత్మికత,దాతృత్వం,భక్తిసమ్మేళనంగా ఈ కార్తీక సోమవారం చామలాదేవి అగ్రహారంలో స్మరణీయంగా నిలిచింది.

మెరుగైన సమాజం కోసం సహకార వ్యవస్థకు చేయూతనందించండి

విశాలాంధ్ర - బొబ్బిలి : మెరుగైన సమాజం కోసం సహకార రంగంలో పేద మధ్యతరగతి ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ (మల్టీ స్టేటస్ కోపరేటివ్ బ్యాంకు) కు విద్యార్థి దశ నుండే విద్యార్థులను బ్యాంకులకు పరిచయం చేయాలని జిల్లా కో-ఆపరేటివ్ అధికారిణి జి పద్మావతి కోరారు. అందులో భాగంగానే అంతర్జాతీయ సహకార సంఘం పై విద్యార్థులకు వ్యాచ రచన పోటీలు నిర్వహించడం,సహకారవ్యవస్థలపైఅవగాహన కల్పించడం శుభపరిణామం అన్నారు. 2025 వ సంవత్సరం అంతర్జాతీయ సహకార సంవత్సరంపురస్కరించుకొనివిశాఖకోఆపరేటివ్ బ్యాంక్ అన్ని బ్రాంచ్ లో అంతర్జాతీయ సహకార సంస్థ వేడుకలు బ్యాంకు చైర్మన్ జెవి సత్యనారాయణమూరివైస్‌చైర్మన్‌రాఘవేంద్రరావుబ్యాంకు డైరెక్టర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం నల్లగొండ దొరబాబు, ద్వితీయ స్థానం సిరికి సౌమ్య, ద్వితీయ స్థానం పి రిషితా శ్రీ లు ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎస్ ఎస్ ఎస్ కళాశాలలో బొబ్బిలి విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ బ్రాంచ్ బ్యాంకు డైరెక్టర్ కే ప్రసాద రావు అధ్యక్షతన ఎస్ ఎస్ ఎస్ కళాశాలలో బహుమతులు ప్రధాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సహకార అధికారిణి జి పద్మావతి పాల్గొని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ జోనల్ మేనేజర్ జే శ్రీనివాసరావు, ఎస్ ఎస్ ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ రౌతు వాసుదేవ రావు లు తదితరులు పాల్గొన్నారు.

తెలగకుల పిక్నిక్ సన్నాహక సమావేశం

విశాలాంధ్ర-రాజాం: తెలగకుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16వతేదీ (ఆదివారం) రాజాం బొబ్బిలి రోడ్డు,ఫైర్ స్టేషన్ వెనక అద్దంకి కృష్ణ వాసు ల మామిడితోటలో నిర్వహించబోయే తెలగకుల పిక్నిక్ కోసం సన్నాహక సమావేశం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ సమావేశంలో ఐదు మండలాలు ం రాజాం, వంగర, సంతకవిటి, రేగిడి ఆమదాలవలస, జి.సిగడాం మండలాలకు చెందిన తెలగకుల పెద్దలు పాల్గొని పిక్నిక్ కార్యక్రమంపై వివరంగా చర్చించారు. సమావేశంలో పాల్గొన్న పెద్దలు పిక్నిక్ విజయవంతం కావడానికి అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు. రవాణా, భోజన ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు, మహిళలు మరియు పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంపై నిర్ణయాలు తీసుకున్నారు. కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నందున, వాహనాల క్రమపద్ధతి, భద్రతా చర్యలు, తాగునీరు మరియు వైద్య సౌకర్యాల వంటి అంశాలను కూడా సభ్యులు చర్చించారు. పిక్నిక్‌లో తల్లిదండ్రులకు, యువతకు ఆత్మీయ పరస్పర పరిచయాల వేదిక, పిల్లలకు వినోదంతో పాటు తెలగకుల ఆచార సాంప్రదాయాలపై అవగాహన కలిగే కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా సభలో మాట్లాడిన పెద్దలు మాట్లాడుతూ, "తెలగకుల ఐక్యతకు, సమాజ బలోపేతానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయి. ప్రతి కుటుంబం తప్పనిసరిగా పాల్గొని పిక్నిక్‌ను విజయవంతం చేయాలి"అని అభిప్రాయపడ్డారు. సభ మాత్రమే కాదు, అందరూ ఒకటి గా కలిసి పనిచేసి పిక్నిక్ ను మరింత ఘనంగా జరిపేందుకు బాధ్యతలు పంచుకున్నారు.

తెలుగు భాషను సంరక్షించడానికి రక్షించడానికి బ్రౌన్ చేసిన కృషి చిరస్మరణీయం

విశాలాంధ్ర-విజయనగరం:ప్రఖ్యాత ఆంధ్రభాషా పండితుడు, తెలుగు నిఘంటువు రచయిత సి.పి. బ్రౌన్ జన్మదినం సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాస మూర్తి కలెక్టరెట్ ఆడిటోరియం లో సోమవారం బ్రౌన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డి ఆర్ ఒ మాట్లాడుతూ, తెలుగు భాషను సంరక్షించడానికి, ప్రాచీన సాహిత్యాన్ని రక్షించడానికి సి.పి. బ్రౌన్ చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన సేవలను మనమందరం స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విజ్ సీఈవో వి. విశ్వేశ్వర రావు, సిపిఒ బాలాజీ, డిఇఒ మాణిక్యం నాయుడు, డిఆర్డిఎ పిడి శ్రీనివాస్ పాణి, ఎస్ డి సిలు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న అధికారులు

విశాలాంధ్ర -విజయనగరం : స్థానిక అయ్యన్నపేటలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని నగరపాలక సంస్థ ప్రణాళిక అధికారులు అడ్డుకున్నారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో 53వ నెంబర్ సచివాలయ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవడంతోపాటు నిర్మాణ సామగ్రిని తరలించివేశారు. పునాదులు వేస్తున్న క్రమంలోనే సోమవారం పనులను అడ్డుకొని నిర్మాణాన్ని నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ అనుమతి లేని అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితులోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రతి నిర్మాణానికి ప్రభుత్వ అనుమతులు తప్పనిసరని అన్నారు. అదనపు నిర్మాణాలకు సైతం అనుమతులు తీసుకోవాలన్నారు. లేనియెడల అట్టి నిర్మాణాలను కూడా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రణాళిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పై నిరసన

విశాలాంధ్ర-తెర్లాం: మండల కేంద్రంలో సోమవారం బొబ్బిలి నియోజవర్గం మాజీ ఎమ్మెల్యే వెంకట చిన్నప్ప నాయుడు విలేకరులతో మాట్లాడుతూ తెర్లాం మండలం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పై నిరసన ఈనెల 12వ తారీఖున మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేసే ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన బొబ్బిలి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి పార్టీ ఇన్చార్జి శ్రీ శంబంగి వెంకట చిన అప్పలనాయుడు వారితోపాటు తెర్లాం మండలం వైఎస్ఆర్ సీపీ మండల ముఖ్య నాయకులు ఉన్నారు.

ఉమామహేశ్వర లక్ష్మీనారాయణ స్వామివారి ఆలయంలో భద్రతా ఏర్పాట్ల సమీక్ష

విశాలాంధ్ర-రాజా:రాజాం మున్సిపాలిటీ పరిధి డోలపేట లో ఉమామహేశ్వర లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో భక్తుల రద్దీ పెరిగే పర్వదినాలను దృష్టిలో ఉంచుకుని రాజాం టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.అశోక్‌కుమార్ భద్రతా ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. దేవాలయ కమిటీ సభ్యులతో మాట్లాడి ఆలయ విశిష్టత, పర్వదినాల్లో భక్తుల రద్దీ, ప్రజల రాకపోకలపై చర్చించారు. ఆలయంలో భద్రతను మరింత మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలను సీఐ సూచించారు. ముఖ్యంగా, సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రవేశ/నిష్క్రమణ మార్గాల వద్ద సమర్థవంతమైన పరిశీలన, భక్తుల కోసం క్యూలైన్ వ్యవస్థలపై సూచనలు అందించారు. కమిటీ సభ్యులు పోలీసు సూచనలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో దళారులు వ్యాపారులు నిబంధనలు

ట్రేడ్ రిజిస్ట్రేషన్ లేకుండా పంట ఉత్పత్తుల కొనుగోళ్లు

కోట్ల రూపాయల్లో వ్యాపారులు మోసం

పాటించకుండా పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. రైతులకు రసీదులు ఇవ్వటం లేదు. ఏటా కోట్లాది రూపాయలు ఎగవేతకు పాల్పడుతున్నారు. సాగుదారుల కష్టం అక్రమాల పాలవుతుంది. సెస్ ఆదాయం కోల్పోతుంది. అక్రమాలు అరికట్టాల్సిన మార్కెటింగ్ శాఖ నిర్లక్ష్యం వ్యవహరిస్తుంది. రైతుల వరి, మొక్కజొన్న వేరుశెనగ కూరగా యలు సాగు చేస్తున్నారు. ఏఎంసీ పరిధిలో ఏటా సెస్ ఆదాయం కోట్లకు పైగా వస్తుంది. నిబంధనల ప్రకారం వ్యాపారులు స్థానిక వ్యవసాయం మార్కెట్ కమిటీ వద్ద ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ప్రతి నెల ఏఎంసి కార్యదర్శులు, మార్కెటింగ్ శాఖ అధికారులు పరిశీలిస్తారు. మార్కెట్ సెస్ ఎగవేయకుండా చూడటానికి అవకాశం ఉంటుంది. కనీసం 10 శాతం మంది కూడా ఏఎంసీ కమిటీ వద్ద ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేయించటం లేదు. దళారులు వ్యాపారులు మిల్లర్లు రైతుల నుంచి వరి, వేరుశెనగలు కాయాలు, శెనగ పలుకులు, మొక్కజొన్న, మినుములు, పెసర,కొనుగోలు చేస్తున్నారు. సాగు దారుల నుంచి ఏ పంట ఎన్ని బస్తాలు కొనుగోలు చేశారన్న వివరాలు తో వ్యాపారులు రసీదులు ఇవ్వటం లేదు. గత రెండేళ్లలో రెండు మండలాల్లో రైతుల నుంచి పంట కొనుగోలు చేసిన కొందరు వ్యాపారులు లక్షల్లో పైగా చెల్లించకుండా ఎగవేశారు. వ్యాపారంలు తప్పకుండా ట్రేడ్ రిజిస్ట్రేషన్ లైసెన్స్ తీసుకునేలా చర్యలు చేపట్టాలని అలాగే పౌర సరఫరాల అధికారులతో కలిసి సెస్ ఆదాయానికి గండి పడకుండా తగు చర్యలు చేపడతారని పలువురు కోరుతున్నారు.

సోంపురం జెడ్పీ హైస్కూల్ వంటగది పునరుద్ధరణకు ఎంపీపీ హామీ

విశాలాంధ్ర-వేపాద : మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో వంటగది పైకప్పు పెంచెలు ఊడిపోవడంతో వంట వండే నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వర్షాకాలంలో వంట చేయడంలో ఇబ్బందులుఎదురవుతుండటంతో స్థానిక ఎంపీటీసీ ఆకుల సత్యనారాయణ ఈ సమస్యను మండల పరిషత్ అధ్యక్షులు దొగ్గ సత్యవంతుడు దృష్టికి తీసుకువెళ్లారు.ఎంపీపీ సత్యవంతుడు సోంపురం పాఠశాలకు వెళ్లి వంటగదిని పరిశీలించి,పరిస్థితిని అంచనా వేశారు. వంటగది శిథిలావస్థను గమనించి, మండల పరిషత్ నిధుల ద్వారా వంటగదిని మరమ్మతు చేసి పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు ఆదేశాలు జారీచేస్తూ, వంటగదిని పరిశీలించి తక్షణమే మెజర్‌మెంట్‌లు, సమర్పించాలన్నారు.ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ కూడా వెంటనే స్పందించి పరిశీలన చేపట్టారు.పాఠశాలసిబ్బంది,గ్రామస్థులు ఎంపీపీసత్యవంతుడు, ఎంపీటీసీ ఆకుల సత్యనారాయణ చొరవకు కృతజ్ఞతలు తెలిపారు.వంటగది పునరుద్ధరణతో విద్యార్థులు, వంట నిర్వాహకులు ఇబ్బందులు లేకుండా మధ్యాహ్న భోజన కార్యక్రమం కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైస్ ఎంపీపీ అడపా ఈశ్వర రావు అరిగిపోలు ఎంపిటిసి తొండవరపు వెంకటరమణ, గ్రామ పెద్దలు ఉగ్గిన శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం రాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయాలి

విశాలాంధ్ర-రామభద్రపురం : అర్హులైన వారందరికీ ప్రభుత్వము కొత్త పింఛన్లు మంజూరు చేసి వారి ని ఆ దుకోవాలని మండల బిజెపి అధ్యక్షురాలు ఎం ఆదిలక్ష్మి కోరారు. సోమవారము మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీ రాములు నాయుడు కు పింఛన్ సమస్యపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కొంతమంది కి అంగవైకల్యం లేనప్పటికీ పింఛన్లు తీసుకోవడం దారుణమని అన్నారు. నూరు శాతం అంగవైకల్యం ఉన్నప్పటికీ అలాంటివారికి తక్కువ పింఛన్ ఇవ్వడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి చెందిన ఎం చిన్న ము నాయుడు , ఎం సూర్యనారాయణ ల కు పూర్తి అంగవైకల్యం ఉన్నప్పటికీ తక్కువ పింఛన్ ఇవ్వడం దారుణమనీ వాపోయారు. వీరిద్దరూపించను మరల పరిశీలించి 15 వేలు పించను వచ్చేటట్టు చూడాలని అన్నారు అన్నారు.

సచివాలయ ఉద్యోగులకు మెమోలు

క్రమశిక్షణా లోపంపై ఎంపిడిఓ ఆగ్రహం

విధుల్లో అలక్ష్యం సహించబోవడం లేదన్న హెచ్చరిక

విశాలాంధ్ర-రాజాం : రాజాం మండలంలోని కంచరాం-1, కంచరాం-2 సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న నలుగురు ఉద్యోగులు విధి సమయాలను పట్టించుకోకుండా ఆలస్యంగా హాజరవుతున్నారన్న ఆరోపణలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఓ) ఆనందరావు క్రమశిక్షణా చర్యలు చేపట్టారు. వారందరికీ శాసన ప్రకారం 'మెమోలు' జారీ చేసినట్లు ఆయన తెలిపారు. సచివాలయాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించడం, పౌర సేవలు అందించడం ప్రధాన బాధ్యతగా ఉన్నప్పటికీ, కొంతమంది ఉద్యోగులు నిర్దిష్ట సమయాలకు హాజరుకాక ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఎంపిడిఓ ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ వ్యవస్థ ప్రజలకు మరింత దగ్గరగా పరిపాలన అందించేందుకు ఏర్పాటు చేయబడింది. అయితే విధుల్లో అలక్ష్యం చేస్తే ఈ వ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బతింటుందని స్పష్టం చేశారు."సమయం పాటించడం ఒక ఉద్యోగి ప్రాథమిక బాధ్యత. ఇప్పటికే అనేకసార్లు సమయపాలనపై హెచ్చరికలు ఇచ్చాం, అయినప్పటికీ మార్పు రాకపోవడంతో క్రమశిక్షణ చర్యగా మెమోలు జారీ చేయాల్సి వచ్చింది," అని ఎంపిడిఓ ఆనందరావు అన్నారు.అదేవిధంగా, సచివాలయ ఉద్యోగులు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేయాలని, ప్రజా సేవలో నిబద్ధత ప్రదర్శించాలని ఆయన సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, పౌర సేవల ఆలస్యం, ప్రజలకు అసౌకర్యం కలిగించే ప్రవర్తన ఏదైనా పరిగణనలోకి తీసుకోబడదని హెచ్చరించారు."విధుల్లో అలక్ష్యం వహిస్తే ఇకపై ఎలాంటి ఉపేక్ష ఉండదు. అవసరమైతే మరింత కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఎంపిడిఓ స్పష్టం చేశారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు తొండ్రంగి విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర-గరివిడి : గరివిడి మండలంలోని తొండ్రంగి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14, 17, 19 విభాగాలలో వివిధ క్రీడల్లో తమ ప్రతిభను చాటారు. సైక్లింగ్ విభాగంలో అప్పలిష్, రవికుమార్, జగదీష్, నారాయణరావు, రాకేష్, తరుణ్, జోషిత, మాధురి, అనురాధ, భార్గవి, జ్యోష్ణ శ్రీ, మాళవిక రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు. కబడ్డీ విభాగంలో వర్షినిప్రియ ఎంపిక కాగా, స్విమ్మింగ్‌లో రాకేష్ మెరుగైన ప్రదర్శనతో రాష్ట్రస్థాయి అవకాశాన్ని అందుకున్నారు. ఖో ఖోలో జగదీష్, ఆంజనేయులు, జోషిత, హారిక, రేఖ, భార్గవి ఎంపికై పాఠశాలకు గౌరవం తెచ్చారు.ఈ సందర్భంగా హెచ్.ఎం. శ్రీనివాసరావు, పి.ఇ.టి. కె. లక్ష్మణ్, గ్రామ పెద్దలు, పీఎంసీ సభ్యులు విద్యార్థులను అభినందించారు.

బోడే రామచంద్ర యాదవ్ విజయనగరం పర్యటన

విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ విజయనగరం పర్యటన విజయవంతం చేయాలని యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇశరపు శేఖర్ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ప్రదీప్ నగర్ వద్ద ఉన్న పోరాట సమితి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన విజయనగరం పట్టణ శివారు గొట్లాం రోడ్డులో ఈనెల 11 మంగళవారం నిర్వహిస్తున్న యాదవ సంక్షేమ సంఘం ఆత్మీయ కలయిక కార్యక్రమానికి రామచంద్ర యాదవ్ విచ్చేస్తున్నారని తెలిపారు.రామచంద్ర యాదవ్ ను మంగళవారం ఉదయం పట్నంలోని ఎస్విఎన్ లేక్ ప్యాలెస్ నుంచి బైక్ ర్యాలీతో గొట్లాం రోడ్డులో నిర్వహిస్తున్న ఆత్మీయకాలిక కార్యక్రమానికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఈ ర్యాలీలో యాదవ యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శేఖర్ యాదవ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారానికి అనుసరించవలసిన విధానాలు తదితర అంశాలపై ఆత్మీయ సమ్మేళనంలో రామచంద్ర యాదవ్ ప్రసంగిస్తారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో డాక్టర్ మురపాల బాలాజీ, కోరాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

అరసాడలో రూ.102 కోట్లతో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు...

సోమవారం అరసాడలో ప్లాంట్ స్థలాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఎస్ రామ సుందర్ రెడ్డి...

నేడు రాజాంలో వర్చువల్ గా ప్లాంటుకు శంకుస్థాపన

విశాలాంధ్ర-వంగర : విజనగరం జిల్లా వంగర మండలం అరసాడ గ్రామంలో పివిఎస్ గ్రూప్ ఆధ్వర్యంలో సుమారు రూ.102 కోట్ల వ్యయంతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు కానుంది. దీని నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కనిగిరి నుండి మంగళవారం ఉదయం 10.30 గంటలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని రాజాం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా అరసాడ గ్రామంలో ప్లాంట్ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఏర్పాట్లను పర్యవేక్షించి అధికారులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రోజుకు 20 టన్నులు ఉత్పత్తి సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 500 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని, నిరుద్యోగ సమస్య కొంత మేర తగ్గుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక లాభాలు కలుగుతాయని వివరించారు. అనుబంధంగా మరికొన్ని యూనిట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. శంకుస్థాపన ఏర్పాట్లు పక్కాగా చేయాలని, వర్చువల్ విధానంలో శంకుస్థాపన వీక్షించడానికి అవసరమైన స్క్రీన్లు, కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అరసాడ గ్రామ పెద్దలు రాజాం ఏఎంసి వైస్ చైర్మన్ లచ్చుభుక్త. ధనలక్ష్మి కృష్ణమూర్తి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ మజ్జి వెంకట నాయుడు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, ఆర్డీవో సత్యవాణి, తహసీల్దార్ పి.రామారావు, నెడ్కాప్, ఏపీఈపీడీసీఎల్ అధికారులు, పీవీఎస్ సంస్థ ప్రతినిధి రామ్మోహన్ , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సుకై మహిళలు ఎదురుచూపులు



విశాలాంధ్ర- రామభద్రపురం : ప్రభుత్వము ఎంతో ప్రతిష్టాత్మకంగా శ్రీ శక్తి పేరుతో ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం మహిళలను నిరాశ పరుస్తుందని ప లువరు మహిళలు ఆరోపిస్తున్నారు. బస్సులు ఖాళీగా వెళ్తున్నప్పటికీ బస్సు స్టాపుల వద్ద ఆపకపోవడంతో మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కార్తీక మాసం కావడంతో ఎక్కువగా మహిళలు ఎక్కువ జామున దైవ దర్శనం కోసం ఆలయాలకు వెళ్ళవలసి వస్తుంది. గుంపుగా ఉన్న మహిళలను చూసి డ్రైవర్లు బస్సు నాపకుండా అతి వేగంగా వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళల కొరకు రాష్ట్ర ప్రభుత్వము ఎన్నికలలో భాగంగా చంద్రబాబు నాయుడు మాట నిలబెట్టుకున్నప్పటికీ డ్రైవర్లు ఆ మాటను పెడచవని పెట్టడం దారుణమైన పలువురు మహిళలు డ్రైవర్ల పై అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్టాపులు వద్ద బస్సు లేపకపోతే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని మహిళలు అంటున్నారు. ఆర్టీసీ, అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి బస్సు లు స్టాపుల వద్ద కచ్చితంగా ఆపేటట్టు చూడాలని పలువురు మహిళలు కోరుచున్నారు. లేదంటే శ్రీ శక్తి పథకానికి ఆర్టీసీ అధికారులే తూట్లు పొడిచిన వారు అవుతారని అంటున్నారు.

అలజంగిలో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురువల్లి మండలం అలజంగి గ్రామంలో సోమవారం నాడు డా.బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం వారి ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథిగా వైఎస్ఆర్సీపీ మండల వైస్ ప్రెసిడెంట్,మాజీ సర్పంచ్ రఘుమండ త్రినాధరావు పాల్గొనగా ఈ శిబిరంలో 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో సుమారు 15మందికి విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి లో శాస్త్ర చికిత్సలు అవసరం కావడంతో ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమం లో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బి.కిషోర్ కుమార్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు డి.రాము మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు గోవిందరాజులు నవభారత్ ఫౌండేషన్ యు.హరి పుష్పగిరి ఆసుపత్రి క్యాంప్ మేనేజర్ బి.నాగరాజు కంటివైద్య నిపుణులు జి.పావని ప్రియ వై.పండు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలి

నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలని విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య కోరారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గా ఎన్నికైన శివప్రసాద్ ను, విజయనగరం జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన నరసింగరావును, యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంఎస్ ఎన్ రాజు ను సోమవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ యూనియన్ నాయకులు అంకితభావంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకోరావాలని కోరారు

ప్రజా ఉద్యమంలో భాగస్వామ్యులు కావాలి..

వైసీపీ నేతల పిలుపు

విశాలాంధ్ర-చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం అమలు జరుపుతున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా ఈ నెల 12న చేపడుతున్న ప్రజా ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చీపురువల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం వలిరెడ్డి శ్రీనివాస నాయుడు మీసాల వరహాల నాయుడు తదితరులు కోరారు.చీపురువల్లి వైస్సార్ పార్టీ కార్యాలయం సోమవారం నాడు ప్రజా ఉద్యమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకొండ గరివిడి మెయిన్ రోడ్ లో గల శంకర్ ఫంక్షన్ హాల్ దగ్గర నుండి బైక్ ర్యాలీ ప్రారంభం అవుతుంది అన్నారు. గరివిడి నుండి చీపురుపల్లి మూడు రోడ్ల కూడలి వరకు బైక్ ర్యాలీ ప్రారంభం అనంతరం స్థానిక మూడు రోడ్ల కూడలిల కూటమి ప్రభుత్వ అరాచకాల పైన నిరసన తెలియజేయడమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్. జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు లు పాల్గొని కూటమి ప్రభుత్వ అరాచకాలను ఎండగడతారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం స్థానిక తాసిల్దార్ కు వినతిపత్రం అందజేయడం జరుగుతుంది అన్నారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గం యూత్ అధ్యక్షులు బెల్లాన వంశీ, జిల్లా మేధావుల అధ్యక్షులు కొంచాడ శ్రీనివాస్ కుమార్,టౌన్ అధ్యక్షులు పతివాడ రాజారావు, నియోజకవర్గం మేధావుల అధ్యక్షులు రాజు మాస్టారు,సర్పంచ్ రఘుమండ త్రినాథ్, వైస్సార్ పార్టీ నాయకులు ఇప్పిలి గోవింద, గవిడి సురేష్, ముళ్ళు పైడిరాజు,గిరిడి రామదాసు,నియోజకవర్గం పార్టీ డిజిటల్ మేనేజర్ కర్రోతు ప్రసాద్, కోసిరెడ్డి రమణ పిసిని శ్రీను,చింతాడ లక్ష్మణ,రేవల్ల సత్తిబాబు, కర్రోతు రమణ,పాండ్రంకి సత్యం, బలగ రమేష్, సోషల్ మీడియా నియోజకవర్గం కన్వీనర్ ప్రభాత్, జమ్ము అప్పలనాయుడు, రౌతు పైడిరాజు,కంచు పల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ పోలీసింగ్‌తో ప్రజలకు మెరుగైన సేవలందించాలి

విజయనగరం ఎస్పీ ఎ.ఆర్. దామోదర్

విశాలాంధ్ర -వెంటాడ: ఆంధ్ర: స్మార్ట్ పోలీసింగ్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, ఐపీఎస్ సూచించారు. ఆయన సోమవారం ఆంధ్ర పోలీసు స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ పరిసరాలు, పనితీరు, రికార్డులను పరిశీలించారు. ఎస్పీ దామోదర్ పోలీసు సిబ్బందితో మమేకమై, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధులను సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రజలు, వృద్ధులు, మహిళలతో మర్యాదగా, ఆప్యాయంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. బాధితుల సమస్యలను ఓపికగా విని, త్వరితగతిన పరిష్కారం చూపాలని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారు, గంజాయి వినియోగదారులు, మహిళలు-బాలలపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి వినియోగించే స్థావరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సైబర్ నేరాలు, రహదారి భద్రత, మహిళా-బాలల రక్షణ అంశాల్లో ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పోలీసు సిబ్బంది పనితీరును ఎస్పీ ప్రశంసిస్తూ, సమర్థవంతంగా పనిచేసే సిబ్బందిని ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. దర్యాప్తులో ఉన్న కేసుల వివరాలను పరిశీలించిన ఎస్పీ, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ భవ్య, గజపతినగరం సీఐ జి.ఎ. రమణ, ఆంధ్ర ఎస్సై కె. సీతారాం, మహిళా పోలీసులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నెల గడిచింది.. నేల బావిలో శవం కథ ఏమైంది?

పోలీసుల పనితీరును దుయ్యబడుతున్న స్థానికులు..
కుల బంధుత్వ నెపంతో కేసును నీరుగార్చే ప్రయత్నాలు...
జిల్లా ఎస్పీ దృష్టి సారించాలంటూ పలువురు సూచన..

విశాలాంధ్ర-చీపురుపల్లి: మండలంలోని పురే వలస గ్రామ సమీపంలో ఇటికల బట్టి వద్ద గల నేలబావిలో అక్టోబర్ 9న శవమై తేలిన ఎలకల రాము 24 అనే యువకుడి కథ నెలరోజులు గడుస్తున్నప్పటికీ పోలీసుల దర్యాప్తులో ఇటువంటి చర్యలు లేకపోవడం పట్ల పలువురు పోలీసుల పనితీరును అనుమానిస్తున్నారు. ఇప్పటికే బంధుత్వాలు, కులం నెపంతో బాధితులను బాధితుల తరఫున పోరాటం చేస్తున్న వారిని సైతం రాజకీయంగా వారిపైన ఒత్తిడి తీసుకువచ్చి కేసులు పక్కదోవే పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నారంటూ స్థానికంగా ప్రచారం జరుగుతుంది. ఇటుక బట్టి యజమాని వండాను సన్యాసిరావు భార్యతో మృతుడు రాము అక్రమ సంబంధం పెట్టుకున్నాడు అనే అనుమానంతో కావాలనే తన కుమారుడ్ని హత్య చేశారంటూ మృతుని తల్లిదండ్రులు గ్రామస్తులు పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి నెల రోజులు గడుస్తుంది. ఈ కేసుకు సంబంధించి సుమారు 8 మందిని విచారించిన పోలీసులు ఇటుక బట్టీల వద్ద వాచ్మెన్ గా పనిచేస్తున్న కుటుంబాన్ని కూడా విచారించే నట్లు సమాచారం. విచారణలో కొన్ని నిజాలు వెల్లడైనప్పటికీ శవ పరీక్షకు సంబంధించిన నివేదికలు రావాలంటూ పోలీసులు కాలయాపన చేస్తున్న పట్ల పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు విచారణ జరిపిన వారిలో ఇటికల బట్టి వద్ద పనిచేస్తున్న ఓ కుటుంబాన్ని కూడా విచారించి అనంతరం వారిని ఊరు దాటించారు అంటూ పలువురు ఆరోపిస్తున్నారు. ఈ మిస్టరీ కి సంబంధించి సెటిల్మెంట్ ల రూపంలో కేసును నీరుగారిచే ప్రయత్నాలు జరుపుతున్నారు అంటూ స్థానికంగా ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో డబ్బులు ఉన్నవారు పేదవారిని చంపి సెటిల్మెంట్లు చేసుకోవచ్చా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొడుకును పోగొట్టుకున్న బాధిత కుటుంబం తమకు ఎటువంటి న్యాయం జరగలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న సన్యాసిరావు కుటుంబం సైతం గ్రామాన్ని విడిచి వేరే ప్రాంతంలో కాలం గడుపుతున్నట్లు పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి చీపురుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తాత్సారం జరుగుతున్న నేలబావిలో నెల రోజుల క్రితం తేలిన ఎలకల రాము మృతి పైన మిస్టరీని విడదీసి బాధిత కుటుంబానికి న్యాయం చేయలంటూ పలువురు కోరుతున్నారు.

బాధితుల సమస్యలను చట్టపరిధిలో తక్షణమే పరిష్కరించాలి

జిల్లా అదనపు ఎస్పీ పి. సౌమ్యలత

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ గారి ఆదేశాలతో అదనపు ఎస్పీ పి. సౌమ్యలత సోమవారం నిర్వహించారు.జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి అదనపు ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను అదనపు ఎస్పీ పి.సౌమ్యలత ఆదేశించారు.పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ కార్యక్రమంలో భాగంగా అదనపు ఎస్పీ 42 ఫిర్యాదులను స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూ తగాదాలకు సంబంధించినవి 13, కుటుంబ కలహాలకు సంబంధించినవి 5, మోసాలకు పాల్పడినట్లు 4, ఇతర అంశాలకు సంబంధించినవి 20 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్లయితే చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సిఐ అంబేద్కర్, డిసిఆర్బి సిఐ కె.కుమారస్వామి, ఎస్ఐ రాజేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్, రహదారి భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి

విజయనగరం మహిళా పిఎస్ డిఎస్పీ ఆర్ గోవిందరావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐ.పి.ఎస్. ఆదేశాలమేరకు సోమవారం పట్టణంలో గల శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్, రహదారి భద్రతా నియమాలు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా కేసులు, శక్తీ యాప్, పోక్సో కేసులు, డిజిటల్ అరెస్టు, మాదక ద్రవ్యాలు, గంజాయి వలన కలిగే అనర్ధాలపై మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి ఆర్ గోవిందరావు , విజయనగరం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సి హెచ్. సూరి నాయుడు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మహిళా పిఎస్ డిఎస్పి ఆర్ గోవిందరావు మాట్లాడుతూ - విద్యార్థులకు శక్తి (ఎస్.ఓ.ఎస్) మొబైల్ యాప్ ఏ విధంగా డౌన్లోడ్ చేయడం, దాని పని తీరు గురించి క్షుణ్ణంగా వివరించారు. మహిళల మొబైల్ ఫోనులో శక్తి యాప్ నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాల్లో రక్షణగా ఉంటుందని, ఒక కుటుంబ సభ్యుడు మీకు తోడు ఉన్న ట్లేనన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ లోని ఎస్.ఓ.ఎస్. బటన్ను ప్రెస్ చేసినట్లయితే క్షణాల్లో పోలీసు బృందం మీరున్న ప్రాంతానికి చేరుకొని, రక్షణగా నిలుస్తారన్నారు. విద్యార్థులు లక్ష్యంపై దృష్టి పెట్టుకొని, చదువుకోవాలని ఇతరులపట్ల ఆకర్షితులు కావద్దని, వారు చెప్పే మాయమాటలు నమ్మి, జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. పోక్సోచట్టం, సోషల్ మీడియా కేసుల్లో శిక్షలు గురించి వివరించి అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎటువంటి ప్రలోభాలకు, ఆకర్షణలకు లోనుకావద్దన్నారు. సైబరు నేరాలు, డిజిటల్ అరెస్టులు పట్ల అవగాహన కలిగి ఉండాలని, సైబరు నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత పడాలన్నారు. విద్యార్థులు గంజాయి, ఇతర మత్తు, మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దని, జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్, రహదారి భద్రత నియమాలు పాటించాలని, హెల్మెట్ వినియోగం గురించి ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు వివరించారు గంజాయి గురించి సమాచారం ఏదైనా తెలిస్తే స్థానిక పోలీసు స్టేషను లేదా డయల్ 100/112 కు లేదా 1972 కు గాని వెంటనే తెలియజేయాలని విద్యార్థులను డిఎస్పి ఆర్ గోవిందరావు కోరారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది,కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి...

లోకేష్ ని అభ్యర్థిస్తున్న కిమిడి కళా వెంకట్రావు...

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందించాలని చీపురుపల్లి శాసనసభ్యుడు తెలుగుదేశం పోలీస్ బ్యూరో సభ్యుడు మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు ఉండవిల్లి నివాసంలో..ఐటీ మరియు విద్యా శాఖా మాత్యులు నారా లోకేష్ ని అభ్యర్థించారు.. శనివారం ఆయన ఐటి మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ని మ ర్యాద పూర్వకంగా కలిసి నియోజకవర్గంలో గల పలు అంశాలను, విజయనగరం జిల్లా రాజకీయ పరిస్థితులను చర్చించారు.

ఫిర్యాదు దారు సంతృప్తే ముఖ్యం

పిజిఆర్ఎస్ కు 178 వినతులు కలెక్టర్ రాంసుందర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : అధికారులందరు ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాటానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదల పరిష్కార వేదిక లో ప్రజల నుండి ఫిర్యాదులు, విజ్ఞప్తులు స్వీకరించారు. మొత్తం 178 ఫిర్యాదులు అందగా వాటిలో అత్యధికంగా 63 దరఖాస్తులు రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా, డీఆర్‌డీఏ శాఖకు 29, మున్సిపాలిటీ శాఖకు 08, హౌసింగ్ శాఖకు 09, డిపిఓ కార్యాలయానికి 14, జి.ఎస్.డబ్ల్యు కు 20 చొప్పున అందగా మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి. ప్రజల విజ్ఞప్తులను స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ప్రతి దరఖాస్తుదారు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. సమయపాలనతో, పారదర్శకంగా, ప్రతి ఫిర్యాదును న్యాయవంతంగా పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదులపై ఫాలోఅప్ చర్యలు తీసుకొని, పరిష్కారం వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎస్. శ్రీనివాస్ మూర్తి, ఎస్డిసి లు వెంకటేశ్వర రావు, మురళి, రాజేశ్వరి, ప్రమీల గాంధీ, బి. శాంతి, కళావతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.